ఆంధ్రజ్యోతి

Edition: Hyderabad (Andhra Jyothi)
Date: 6 -9- 2006 Page No. 5

## ఎల్.వి.ప్రసాద్ స్మారక

# తపాలా బిళ్ల విడుదల

హైదరాబాద్, సెప్టెంబర్ 5: (ఆన్‌లైన్) 'సామాజిక, కుటుంబ విలువల్ని తన చిత్రాల ద్వారా సమాజానికి తెలియచెప్పిన ధన్యజీవి ఎల్.వి.ప్రసాద్. ఆయన స్మృతి చిహ్నంగా ఇవాళ తపాలా శాఖ స్టాంప్‌ను విడుదల చేయడం ఎంతో ఆనందంగా ఉంది' అని కేంద్ర ప్రసార, సమాచార సాంకేతిక శాఖ సహాయ మంత్రి డాక్టర్ షకీల్ అహ్మద్ అన్నారు. దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత, ప్రముఖ దర్శక నిర్మాత స్వర్గీయ ఎల్.వి. ప్రసాద్ స్మారక తపాల బిళ్లను మంగళవారం హైటెక్స్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో షకీల్ అహ్మద్ విడుదల చేశారు.



దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత స్వర్గీయ ఎల్.వి.ప్రసాద్ తపాళా బిళ్లను హైదరాబాద్‌లో మంగళవారం ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి షకీల్ అహ్మద్. చిత్రంలో దాసరి నారాయణరావు, కె.రోశయ్య, కమల్‌హాసన్, ప్రసాద్ సంస్థ ఎండి అక్కినేని రమేష్ ప్రసాద్ ఉన్నారు. (ఇన్‌సెట్‌లో) ఎల్.వి.ప్రసాద్ పోస్టల్ స్టాంపు

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'ఎంతోమంది నటీనటులకు స్టార్‌డమ్‌ను తెచ్చిపెట్టిన ఎల్.వి.ప్రసాద్ ఐదు దశాబ్దాల పాటు చిత్రసీమలో తనదైన ముద్రవేశార'ని కొనియాడారు. సభకు అధ్యక్షత వహించిన రాష్ట్ర ఆర్థిక శాఖమంత్రి కె.రోశయ్య మాట్లాడుతూ, "ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొనాల్సి ఉన్నా అనివార్య కారణాల వల్ల ఆయన ఢిల్లీ నుంచి రాలేకపోయార'ని తెలిపారు.

ముఖ్య అతిథి, కేంద్ర బొగ్గు శాఖ సహాయ మంత్రి దాసరి నారాయణరావు మాట్లాడుతూ, 'స్వయంకృషితో మనిషి సాధించలేనిది ఏదీ లేదని నిరూపించిన వ్యక్తి ఎల్.వి. ప్రసాద్' అని అన్నారు. ఆయన బ్యానర్‌లో 'ఏ కైసా ఇన్సాఫ్' అనే చిత్రానికి దర్శకత్వం వహించే అవకాశం తనకు లభించిందని, ఎల్.వి.ప్రసాద్‌లో గొప్ప నటుడు కూడా ఉన్నారని దాసరి నారాయణరావు తెలిపారు. రెండేళ్ళుగా పెండింగ్‌లో ఉన్న చిత్తూరు వి.నాగయ్య, సావిత్రి తపాల బిళ్లలను కూడా పోస్టల్ డిపార్ట్‌మెంట్ విడుదల చేయాల్సిందిగా ఆయన కోరారు. ఎల్.వి. ప్రసాద్ స్మారక తపాలా బిళ్లను విడుదల చేయడం ద్వారా ప్రభుత్వం భారతీయ సినిమా రంగాన్ని గౌరవించినట్లయిందని సీనియర్ నిర్మాత డి.వి. యస్. రాజు అన్నారు.

కత్తి కంటే కలం గొప్పదని, కలం కంటే ఫిల్మ్ గొప్పదని ఎల్.వి. ప్రసాద్ చెబుతుండేవారని, సినిమాను శ్వాసగా భావించిన సినీ రుషి ప్రసాద్ అని ఈనాడు గ్రూప్ ఛైర్మన్ రామోజీరావు కొనియాడారు. ఎల్.వి. ప్రసాద్ రూపొందించిన 'ఏక్ దూజే కేలియే' తన కెరీర్‌ను మలుపు తిప్పిందని, అలానే ఆయన తన బ్యానర్‌లో నటించడం అదృష్టంగా భావిస్తుంటానని నటుడు కమల్‌హాసన్ అన్నారు. ప్రసాద్ గ్రూప్ స్వర్ణోత్సవాన్ని జరుపుకుంటోందని, ఈ సందర్భంగా తన తండ్రికి నివాళిగా ప్రభుత్వం తపాల బిళ్లను విడుదల చేయడం గర్వంగా ఉందని ప్రసాద్ గ్రూప్స్ ఛైర్మన్ రమేశ్ ప్రసాద్ తెలిపారు.

ఈ సమావేశంలో చీఫ్ పోస్ట్ మాస్టర్ ఆఫ్ జనరల్ యశోధరా మీనన్, కైలాస్ ప్రసాద్, ప్రసాద్ ఐ హాస్పిటల్ ఛైర్మన్ గొల్లపల్లి నాగేశ్వరరావు, నందగోపాల్ తదితరులు పాల్గొన్నారు. ఎల్.వి.ప్రసాద్‌కు సంబంధించిన పుస్తకాన్ని రోశయ్య ఆవిష్కరించి, దాసరి నారాయణరావుకు అందచేశారు.

ఎల్.వి.ప్రసాద్ జీవితంలోని ప్రధాన ఘట్టాలను తెలియచేసే డాక్యుమెంటరీని ఆహూతులకు ప్రదర్శించారు.